సాక్షి
మంచిర్యాల
సోమవారం । 6 । ఫిబ్రవరి । 2023



ఏజెన్సీలో జననీ నిరీక్షణ కేంద్రాలు

ఏజెన్సీ ప్రాంతాల్లో గర్భిణుల సంరక్షణ కోసం ఐటీడీఏ చర్యలు చేపడుతోంది. ఈమేరకు జననీ నిరీక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. 10లో▸



లక్ష్య సాధనకు కృషి చేయాలి

సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్లు జి.వెంకటేశ్వరరెడ్డి(డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్), కె.శ్రీనివాస్(డైరెక్టర్ ఆపరేషన్) సూచించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
34.2 /17.3

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ స్వల్పంగా పెరుగుతుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువ అనిపిస్తుంది. చలి ప్రభావం తగ్గుతుంది.

వడ్ల పైసలు రాలే!



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు(ఫైల్)



ఈ ఫొటోలోని రైతు పేరు బండారి మల్లేశ్. దండేపల్లికి చెందిన ఈయన వానాకాలంలో వరి సాగుచేశాడు. 85 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించాడు. ధాన్యం తూకం వేసి రెండు నెలలు గడిచింది. కానీ, ఇప్పటికీ మల్లేశ్ ఖాతాలో ధాన్యం డబ్బులు జమ కాలేదు. ధాన్యం తూకం వేయడానికి రోజుల తరబడి నిరీక్షించిన మల్లేశ్.. అమ్మిన తర్వాత కూడా డబ్బుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. డబ్బుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు.

- ధాన్యం అమ్మి రెండు నెలలు.. అన్నదాతకు తప్పని ఎదురు చూపులు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న 3,767 మంది రైతులు
- జిల్లా రైతులకు ప్రభుత్వం రూ.33 కోట్లు బకాయి

మంచిర్యాలఅగ్రికల్చర్: 'ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం దళారులకు విక్రయించి నష్టపోవద్దు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలి. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తాం' ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు చెప్పిన మాటలివి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరేగా ఉంది. ధాన్యం విక్రయించి నెలలు గడుస్తున్నా, ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేసి నెల రోజులు కావొస్తున్నా ఇంకా చాలామంది రైతుల ఖాతాల్లో నగదు జమ కాలేదు. జిల్లాలో ఇంకా 3,767 మంది రైతులు ధాన్యం డబ్బుల కోసం నిరీక్షిస్తున్నారు. వీరికి రూ.33,72,66,776 అందాల్సి ఉంది. నగదు కోసం బ్యాంకులు, ఏజెన్సీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

అమ్మడానికి అష్ట కష్టాలు..

వానాకాలంలో పండించిన ధాన్యం అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల్లో రైతులు అష్టకష్టాలు పడ్డారు. అమ్మిన ధాన్యం నగదు కోసం ఇప్పుడు ఎదురు చూపులు తప్పడం లేదు. మాయిశ్చర్ పేరుతో కొన్ని రోజులు, రవాణాకు లారీలు లేవని మరికొన్ని రోజులు, గన్నీ సంచులు, హమాలీల కొరత పేరుతో ఇంకొన్ని రోజులు ధాన్యం తూకం వేయకపోవడంతో రైతులు కల్లాల్లో రోజుల తరబడి ధాన్యానికి కాపలా ఉన్నారు. చివరకు వర్షాలకు ధాన్యం తడిసి ఇబ్బంది పడ్డారు. మిల్లర్లు ధాన్యాన్ని పూర్తిగా పరిశీలించాకే కొనుగోలు చేస్తూ, తర్వాత నిరాకరించడం పరిపాటిగా మారింది. తర్వాత తరుగు పేరుతో బస్తాకు 3 నుంచి 5 కిలోల వరకు కోతలు విధించారు. లారీల కోసం పడిగాపులు కాసి రైతులు డ్రైవర్లకు రూ.3 వేల నుంచి రూ.6 వేల వరకు చెల్లించి ధాన్యం బస్తాలు లోడింగ్ చేసుకున్నారు. ఇన్ని కష్టాలు పడి ధాన్యం అమ్ముకోవాల్సి వచ్చింది.

జిల్లాలో సేకరించిన ధాన్యం	1,58,337.520 మెట్రిక్ టన్నులు
ధాన్యం విక్రయించిన రైతులు	29,686 మంది
చెల్లించాల్సిన నగదు	రూ.323,56,47,736
ఖాతాల్లో జమ చేసిన నగదు	రూ.289,83,80,960
ఇప్పటి వరకు డబ్బులు అందిన రైతులు	25,919 మంది
నగదు అందాల్సిన రైతులు	3,767 మంది
రైతులకు అందాల్సిన నగదు	రూ.33,72,66,776



లక్ష్యం కన్నా తక్కువే..

వానాకాలంలో జిల్లాలో 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అయితే అనుకున్న లక్ష్యం కన్నా 77 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తక్కువగా వచ్చింది. అయినా ధాన్యం కొనుగోళ్లలో చార్జీల పేరుతో కేంద్రాల నిర్వాహకులు రైతుల జేబులు లూటీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో తేమ శాతం పేరుతో కోత విధించిన మిల్లర్లు, ఈ ఏడాది తాలు, తప్ప ఉందని మెలిక పెట్టి 3 నుంచి 5 కిలోల వరకు తరుగు తీశారు. ఇటు కేంద్రాల నిర్వాహకులు, అటు మిల్లర్ల కొర్రీలతో ఏమీ అనలేని పరిస్థితుల్లో రైతులు ధాన్యం విక్రయించాల్సి వచ్చింది.

జీరో కొనుగోళ్లు..

కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి నిరీక్షించినా తూకం వేయకపోవడంతో కొంతమంది రైతులు గ్రామాల్లో జీరో కొనుగోళ్లు చేస్తున్న వ్యాపారులను ఆశ్రయించారు. ప్రభుత్వ మద్దతు ధర ఏగ్రేడ్ రకం క్వింటాల్‌కు రూ.2,060, సాధారణ రకం రూ.2,040 ఉండగా వ్యాపారులు ఎలాంటి కోతలు లేకుండా రూ.1,600 నుంచి రూ.1,700 ధరతో కొనుగోలు చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుంటే 20 రోజుల వరకు నగదు అందడం లేదని వ్యాపారులు అమ్మిన వెంటనే డబ్బులు చెల్లించడంతో కొంత మంది రైతులు ధర తక్కువైనా అమ్ముకున్నారు.

నగదు చెల్లింపులో జాప్యం..

జిల్లాలో 2 నెలలు ధాన్యం సేకరణ చేశారు. మొత్తం 29,686 మంది రైతుల నుంచి రూ.323,56,47,736 విలువైన 1,58,337.520 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించారు. ఇప్పటి వరకు 25,919 మంది రైతులకు రూ.289,83,80,960 నగదు చెల్లించారు. ఇంకా 3,767 మందికి రైతులకు రూ.33,72,66,776 చెల్లించాల్సి ఉంది. ధాన్యం విక్రయించి రెండు నెలలైనా ఖాతాలో జమ కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాసంగి పంటల పెట్టుబడికి నగదు అందక అప్పులు చేసి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేశామని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ధాన్యం డబ్బులు చెల్లించాలని కోరుతున్నారు.

న్యూస్‌రీల్

టూరిజం కార్పొరేషన్ ఎండీ తనిఖీ



పర్యాటకులతో మాట్లాడుతున్న మనోహర్‌రావు

జన్నారం: తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ మనోహర్‌రావు జన్నారంలోని హరిత రిసార్ట్‌ను ఆదివారం తనిఖీ చేశారు. గదుల రిజిస్టర్లను పరిశీలించారు. భోజనం, సౌకర్యాల గురించి పర్యాటకులను అడిగి తెలుసుకున్నారు. భోజనం బాగుందని పర్యాటకులు తెలిపారు. వసతులు కూడా బాగున్నాయని పర్యాటకులు చెప్పడంతో మేనేజర్ వీరేందర్‌ను అభినందించారు. ఆయన వెంట జన్నారం ఎంపీటీసీ రియాజొద్దీన్, సిబ్బంది ఉన్నారు.

సాఫ్ట్ బేస్‌బాల్‌లో గోల్డ్ మెడల్



మెడల్ సాధించిన విద్యార్థులు..

జన్నారం: జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో జన్నారం స్లేట్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మహారాష్ట్రలోని సాంగ్లీలో జరిగిన పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరపున పోటీల్లో పాల్గొన్న స్లేట్ పాఠశాలకు చెందిన ఐదుగురు బాలురు, బాలికలు వేర్వేరుగా ఆడి గోల్డ్ మెడల్ సాధించినట్లు వివరించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందించారు.

ముగిసిన ఎన్‌సీసీ'ఏ' సర్టిఫికెట్ పరీక్షలు



పరీక్ష పేపర్ ఓపెన్ చేస్తున్న ప్రిన్సిపాల్

మంచిర్యాలఅర్బన్: స్థానిక ట్రినిటి హైస్కూల్‌లో ఎన్‌సీసీ వార్షిక ట్రైనింగ్ పరీక్షలో భాగంగా ఆదివారం ఎన్‌సీసీ 'ఏ' పరీక్షలు నిర్వహించారు. సుబేదార్ మేజర్ సురేందర్‌సింగ్, హవల్దార్ కరమ్‌జిత్‌సింగ్ ఆదిలాబాద్ యూనిట్ నుంచి పరీక్షల పర్యవేక్షకులుగా వ్యవహరించగా దొనబండ, సబ్బెపల్లి, ట్రినిటి స్కూల్, గర్మిళ్ల స్కూల్, గరల్స్ హైస్కూల్‌కు చెందిన 158 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షల అనంతరం 32(టి) బీఎన్‌ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు వెపన్ ట్రైనింగ్ పరీక్ష, ఫీల్డ్, డ్రిల్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

వీక్షించి.. బంధించి



కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో బర్డ్‌వాక్ ఆదివారంతో ముగిసింది. ఉదయం ఆరు గంటలకు కల్పకుంటకు వెళ్లిన వాచర్లు పక్షుల ఫొటోలను కెమెరాల్లో బంధించారు. 8లో▸

యునానీ మెడిసిన్‌లో సీవోఈ విద్యార్థికి సీటు



అక్షయ్‌ని అభినందిస్తున్న, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ(సీవోఈ) కళాశాలలో చదివిన విద్యార్థి యునానీ మెడిసిన్‌లో సీటు సాధించాడు. కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐనాల సైదులు యునానీ మెడిసిన్‌లో సీటు సాధించిన కొండగొర్ల అక్షయ్‌ను అభినందించారు. తమ కళాశాలలో ఇంటర్ చదివిన అక్షయ్ నీట్ పరీక్ష రాశాడని తెలిపారు. ర్యాంకు ఆధారంగా హైదరాబాద్‌లోని ఏకైక ప్రభుత్వ యునానీ మెడికల్ కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ యునానీ మెడిసిన్ అండ్ సర్జరీ(బీయూఎంఎస్) సీటు వచ్చినట్లు వివరించారు. తల్లిదండ్రులు కొండగొర్ల పద్మ, శంకర్ కలను అక్షయ్ నిజం చేశాడని పేర్కొన్నారు.

ముగిసిన ట్రస్మా ఆటల పోటీలు



విజేతలతో ఎంఈవో పోచయ్య, ట్రస్మా బాధ్యులు

మంచిర్యాలఅర్బన్: ప్రైవేట్ పాఠశాలల సంఘం (ట్రస్మా) ఆధ్వర్యంలో మంచిర్యాల ఉషోదయ పాఠశాలలో రెండు రోజులు నిర్వహించిన జిల్లా స్థాయి ఆటల పోటీలు ఆదివారం ముగిశాయి. కబడ్డీ, ఖోఖో, టగ్‌ఆఫ్‌వార్, వాలీబాల్, క్యారమ్, చెస్, అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 2 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. మంచిర్యాల మండలం ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. తాండూర్ మండలం రెండో స్థానం, నస్పూర్ మండలం మూడో స్థానంలో నిలిచాయి. ఎంఈవో పోచయ్య, డీఎస్‌వో మధుబాబు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ట్రస్మా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 50 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో ట్రస్మా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పద్మచరణ్, రాష్ట్ర, జిల్లా బాధ్యులు శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, బాలాజీ, సత్తయ్య, ఉప్పలయ్య లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంపై నిర్లక్ష్యం

- ఇరుకు రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు
- రహదారి విస్తరణ పనుల్లో జాప్యం
- బైపాస్ రోడ్డును తవ్వి ఏడాది పూర్తి
- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు



ఇరుకు రోడ్డుపై ఏర్పాటు చేసిన డివైడర్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రం మంచిర్యాలలో రహదారుల విస్తరణను అధికారులు, పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. రోడ్ల నిర్మాణం, విస్తరణకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నా.. అధికారులు, స్థానిక పాలకులు పనులు ప్రారంభించి వదిలేస్తున్నారు. ప్రారంభంపై చూపిన శ్రద్ధ పనులు పూర్తిచేయడంలో చూపడం లేదు. దీంతో కోట్ల రూపాయలతో చేపట్టిన పనులు గడువులోగా పూర్తి కావడం లేదు. వాహనదారులు, ప్రజలు అసంపూర్తి పనులతో అవస్థలు పడుతున్నారు.

సగంలోనే వదిలేశారు..

వైశ్య భవన్ నుంచి లక్ష్మీ థియేటర్ చౌరస్తా వరకు రూ.7 కోట్ల నిధులతో బైపాస్ రోడ్డు నిర్మించేందుకు ఏడాది క్రితం రోడ్డును తవ్వి వదిలేశారు. ఇందులో సగం రోడ్డు పనులు మాత్రమే పూర్తి చేశారు. అరకిలోమీటరు మేర ఇంకా పనులను చేపట్టాల్సి ఉంది. కానీ అవి ముందుకు సాగడంలేదు. అంసపూర్తి రోడ్డుతో ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డును తవ్వడంతో గుంతలుగా మారి, వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ములేస్తోంది. స్థానికంగా నివాసం ఉండే కాలనీ ప్రజలతోపాటు, వ్యాపారులు దుమ్ముతో ఇబ్బంది పడుతున్నారు.

ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు..

ఐబీ చౌరస్తా నుంచి పాతమంచిర్యాల వరకు జాతీయ రహదారి(ఎన్‌హెచ్63) రోడ్డు ఇరుకుగా ఉండగా, ఆ ఇరుకైన రోడ్డు మధ్యలోనే డివైడర్ ఏర్పాటు చేశారు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏడాదిన్నర క్రితం వైశ్యభవన్ నుంచి ఐబీ చౌరస్తా మీదుగా చున్నంబట్టివాడ వరకు ఉన్న రోడ్డు మధ్యలో ఆర్‌అండ్‌బీ అధికారులు రూ.22 లక్షలతో డివైడర్ నిర్మించారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారింది. విస్తరణ కోసం రోడ్డుకు ఇరువైపులా మట్టి పోసి వదిలేశారు. రోడ్డు విస్తరణ చేయకుండా డివైడర్ నిర్మించడంతో భారీ వాహనాలు వెళ్లే సమయంలో పక్కనే వెళ్లే ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడుతున్నారు. ఈ విషయమై మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఏడాదిన్నరగా రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగడం లేదు.

పనులు ప్రారంభిస్తాం



ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి పాతమంచిర్యాల బ్రిడ్జి వరకు రోడ్డు విస్తరణ పనులు నేషనల్ హైవే వారు చేపట్టేందుకు టెండర్ పూర్తి చేశారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బైపాస్ రోడ్డు పనులు చేపట్టేందుకు రూ.7 కోట్లు కేటాయించి టెండరు పూర్తి చేశాం. ఈ నెలలోనే పనులను ప్రారంభించి త్వరగా పూర్తి చేస్తాం. దుమ్ము లేవకుండా బైపాస్ రోడ్డుపై నీళ్లు చల్లిస్తాం.

– ఎస్.బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్, మంచిర్యాల

టెండర్ పూర్తయినా..

ఇక జిల్లా కేంద్రం ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి పాతమంచిర్యాల రాళ్లవాగు బ్రిడ్జి వరకు రోడ్డును ఇరువైపులా 6 మీటర్ల చొప్పున వెడల్పు చేయడంతోపాటు, రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మాణం, విద్యుత్ స్తంభాల తొలగింపు పనులను చేపట్టేందుకు మంచిర్యాల మున్సిపాలిటీ పట్టణ ప్రగతి నిధులు రూ.6 కోట్లు కేటాయించింది. రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలను తొలగించారు. విస్తరణ పనులు కూడా ప్రారంభించారు. ఇంతలో జాతీయ రహదారి మంజూరు కావడంతో విస్తరణ పనులు నిలిపివేశారు. రోడ్డును నేషనల్ హైవే అథారిటీకి అప్పగించారు. ఈ పనులను చేపట్టేందుకు రూ.14 కోట్లు కేటాయించి టెండరు ప్రక్రియ పూర్తిచేశారు. కానీ, పనులు ఇంకా ప్రారంభించలేదు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ ఆడుతున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ రాహుల్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఓపెన్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అడిషనల్ కలెక్టర్ రాహుల్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ గాజుల ముఖేశ్‌గౌడ్ హాజరై పోటీలను ప్రారంభించారు. విజేతలుగా మధుకుమార్, బీమ్‌రావు, రన్నరర్స్‌గా తాజ్, సాయి నిలిచారు. వీరికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం వచ్చేనెల గోవాలో జరిగే జాతీయస్థాయి బ్యాడ్మింటన్ మాస్టర్స్ 70 ప్లస్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుడు పల్లెం రాజలింగును సన్మానించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ జిల్లా కార్యదర్శి సుధాకర్, ట్రెజరర్ సత్యపాల్‌రెడ్డి, పీఈటీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బండ మీనారెడ్డి, బెల్లం శ్రీనివాస్, మాస్టర్స్ బ్యాడ్మింటన్ ఓనర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మధుకుమార్, లక్ష్మీనారాయణ, కోచ్ నాగేంద్ర, పీఈటీలు రాజయ్య, యాకుబ్, సంతోశ్, పున్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గాజుల ముఖేశ్‌గౌడ్

మైసమ్మ తల్లికి నీరాజనం

మందమర్రి మండలం బొక్కలగుట్ట పంచాయతీ పరిధిలోని గాంధారీ ఖిల్లా వద్ద మూడు రోజులుగా నిర్వహిస్తున్న గాంధారీ మైసమ్మ జాతర ఆదివారం ముగిసింది. చివరిరోజు నాయక్‌పోడ్‌లు వందలాదిగా తరలివచ్చి మైసమ్మ తల్లికి పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. గాంధారీ ఖిల్లా దిగువ భాగం నుంచి మైసమ్మ తల్లి వద్దకు సంప్రదాయ తప్పెటగూళ్లు ఆడుతూ డప్పుచప్పుళ్లతో చేరుకున్నారు. పవిత్ర గంగాజలంతో అమ్మవారికి అభిషేకం చేశారు. పట్నాలు వేశారు. నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. కోళ్లు, మేకలు బలి ఇచ్చారు. జాతరకు జిల్లాతోపాటు పక్క జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో నాయక్‌పోడ్‌లు, భక్తులు తరలిరావడంతో గాంధారీ ఖిల్లా ప్రాంతమంతా సందడిగా మారింది. జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో రాంబాబు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి నీలిమ ప్రత్యేక పూజలు చేశారు. ఖిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని, ఏటా జాతర ఘనంగా నిర్వహించేందుకు సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. అనంతరం నిర్వహించిన దర్బార్‌లో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో రాంబాబు గిరిజనుల సమస్యలు విన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. – రామకృష్ణాపూర్



బోనాలతో మహిళ



గాంధారి మైసమ్మ



గాంధారి మైసమ్మ వద్ద భక్తులు



కాలభైరవుడికి జెడ్పీ చైర్‌పర్సన్ పూజలు



గుట్టపై కాలభైరవుని వద్ద భక్తుల పూజలు



క్లుప్తంగా

గంజాయి పట్టివేత



గంజాయితో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మందమర్రిరూరల్: మందమర్రి టోల్ ప్లాజా సమీపంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం తనిఖీలు చేపట్టగా 1.25 కేజీల గంజాయి పట్టుబడింది. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అశోక్ వివరాల ప్రకారం... టోల్‌ప్లాజా తనిఖీలో ఇద్దరిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. వారిని మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. నిందితులలో ఒకరు మైనర్ ఉన్నాడు.

కోతుల దాడిలో యువకుడికి గాయాలు



గాయపడిన శ్రీనివాస్

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియా అరుణక్కనగర్‌కు చెందిన శ్రీనివాస్ కోతుల దాడిలో గాయపడ్డాడు. శ్రీనివాస్ ఇంటిలో పని చేసుకుంటుండగా ఒక్కసారిగా కోతుల గుంపు అతడి మీద పడి గాయపరిచాయి. స్థానికులు వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కోతుల బారి నుండి తమను కాపాడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

కాగజ్‌నగర్‌టౌన్: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని కౌసర్‌నగర్‌కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ వివరాల ప్రకారం... సమ్రీన్ ఫాతిమా (24) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. కడుపు నొప్పి తట్టుకోలేక ఇంట్లోని బాత్‌రూమ్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ఫసి స్థానికంగా లేడీస్ టైలర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి పాప, బాబు ఉన్నారు. మృతురాలి సోదరుడు సలీం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆలిండియా గేమ్స్ పోటీల్లో తండ్రీకొడుకుల ప్రతిభ

కాగజ్‌నగర్‌టౌన్: ఈనెల 2, 3, 4వ తేదీల్లో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన ఆల్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ పోటీల్లో తండ్రి, కొడుకులు ప్రతిభ కనబర్చి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్థానికుడైన విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ ఎంఎ డేవిడ్ ఫ్రాన్సిస్ ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఆయనతో పాటు అతడి కుమారుడు అథ్లెటిక్స్ పోటీలో పతకాలు సాధించారు. ఎంఏ డేవిడ్ ఫ్రాన్సిస్ 75 సంవత్సరాల విభాగంలో లాంగ్ జంప్‌లో బంగారు పతకం, షార్ట్‌పుట్‌లో వెండి పతకం సాధించారు. ఆయన కుమారుడు ఎంఏ ప్రవీణ్‌కుమార్ 45ఏళ్ల విభాగంలో ఐదు కిలో మీటర్ల వాకింగ్‌లో వెండి పతకం సాధించాడు. త్వరలోనే జరిగే ఆల్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ పోటీలకు తండ్రి కొడుకు ఎంపికయ్యారు.

వీక్షించి.. బంధించి



గోల్డెన్ ఓరియోల్(వంగపండు పిట్ట)



వైట్ వాగ్టైల్



పక్షిని కెమెరాలో బంధిస్తున్న జేఎన్‌ఏఎఫ్‌ఏయూ స్టూడెంట్

- కెమెరాలలో భద్రపరచి..
- రెండోరోజు ముగిసిన బర్డ్‌వాక్
- అడవిలోనే బసచేసిన పక్షి ప్రేమికులు

జన్నారం: పక్షులు కిలకిల రాగాలు పలికే... పక్షి మురిసిన క్షణాలు ఎన్నటికీ మరువలేనివని అంటున్నారు పక్షి ప్రేమికులు. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో బర్డ్‌వాక్ రెండో రోజు కొనసాగింది. రెండు రోజుల బర్డ్‌వాక్ ఆదివారంతో ముగిసింది. శనివారం రాత్రి జన్నారం డివిజన్‌లోని కామన్‌పల్లి వాచ్‌టవర్, ఘనిషెట్టి కుంటలలో డేరాలు ఏర్పాటు చేశారు. వీటిలో పక్షి ప్రేమికులు బస చేశారు. తెల్లవారు ఆరు గంటలకు కల్పకుంటకు వెళ్లి పక్షుల కిలకిలల మధ్య ఆనందంగా పక్షులను కెమెరాలలో బంధించారు. వాటిని చూసి మురిశారు. అక్కడి నుంచి మైసమ్మ కుంటలో గంటపాటు పక్షులను కెమెరాలలో బంధించారు. వెదురు వంతెన, గడ్డి క్షేత్రాలను పరిశీలించి అక్కడి నుంచి ఘనిషెట్టి కుంటలో అల్పాహారం చేసి, తిరిగి అటవీశాఖ గెస్ట్ హౌజ్‌కు వెళ్లారు. అక్కడ వారి అనుభవాలను అటవీశాఖ అధికారులతో పంచుకున్నారు.



పక్షుల ఫొటోలు తీస్తున్న బర్డ్‌వాచర్లు



శాండీపైపర్

ఆనందంగా ఉంది



బర్డ్‌వాక్ ఉందని తెలియగానే ఇక్కడికి వచ్చాను. పేరు నమోదు చేయించుకున్న వారికి అటవీశాఖ వసతులు కల్పించింది. కామన్‌పల్లి వాచ్‌టవర్ వద్ద అటవీశాఖ అధికారులు డేరాలను ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి వరకు ఫైర్‌క్యాంప్ పెట్టుకుని డేరాలలో బస చేశాము. తెల్లవారు జామునే కలకుంటలో పక్షులను గమనించాము. ఇలాంటి చోటుకు రావడం ఆనందంగా ఉంది.

– ఇర్షాద్, చార్టర్డ్ అకౌంటెంట్, హైదరాబాద్

160 రకాల పక్షులను గుర్తించాం



మా పాఠశాల తరుపున ఇక్కడికి వచ్చాము. పక్షులపై మా పాఠశాలలో అవగాహన కల్పించారు. 300 రకాల పక్షుల గురించి తెలుసుకున్నాను. ఇక్కడ రెండు రోజులుగా పక్షులను గమనించాము. 160 రకాల పక్షులను గుర్తించాము. వీటి పేర్లను కూడా చెప్పగలను. రెండు రోజుల పర్యటన అద్భుతంగా ఉంది.

– దీపిక, 9వ తరగతి విద్యార్థిని, కామారెడ్డి

చాల రకాల పక్షులను గమనించాం



బర్డ్‌వాక్‌లో భాగంగా ఇక్కడికి వచ్చాము. ఇప్పటి వరకు రెండు సార్లు బర్డ్‌వాక్‌లో పాల్గొన్నాను. అరుదైన పక్షి జాతులు ఇక్కడ గమనించాము. శీతాకాలంలో రకరకాల పక్షులు ఇక్కడికి చేరుకుంటాయని అధికారులు చెబుతున్నారు. ఐరోపా, ఆసియా ఖండాలలో ఉండే పక్షులను ఇక్కడ చూశాం. బర్డ్‌వాక్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది.

– కిశోర్, హైదరాబాద్

టీజీఎల్ బీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా చాంద్‌పాషా



చాంద్‌పాషా

బెల్లంపల్లి: తెలంగాణ గోదా వరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం (టీఎల్‌జీబీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడిగా బెల్లంపల్లికి చెందిన ఎండి చాంద్‌పాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. శనివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో రాష్ట్ర 11వ మహాసభలు నిర్వహించారు. ఆ సభలో చాంద్‌పాషాను వరుసగా రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు నీల్వాయి విద్యార్థి



నగదు అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ



హర్షిన్‌బాను

వేమనపల్లి: నీల్వాయిలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎండి హర్షిన్‌బాను జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సాంబశివరావు, పీఈటీ మల్లేష్ తెలిపారు. ఆమె మంచిర్యాల జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభకనబర్చింది. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు బిహార్ రాష్ట్రంలోని పాట్నలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలలో పాల్గొననుంది. క్రీడాకారిణి ప్రయాణ ఖర్చుల కోసం జెడ్పీటీసీ ఆర్.స్వర్ణలత, ఎంపీటీసీ సంతోష్‌కుమార్, సర్పంచ్ గాలి మధు నగదు అందజేసి అభినందించారు.

లక్ష్య సాధనకు సమష్టిగా కృషి చేయాలి

- ఇందారం ఓసీపీ శ్రీరాంపూర్ డివిజన్‌కే తలమానికం
- సింగరేణి డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్
- శ్రీరాంపూర్, మందమర్రి డివిజన్‌లో పర్యటన



ఇందారం ఓపెన్‌కాస్టును సందర్శిస్తున్న డైరెక్టర్లు



క్రషర్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్లు

జైపూర్/నస్పూర్/రామకృష్ణాపూర్: సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ఉద్యోగులు సమష్టిగా కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్లు జి.వెంకటేశ్వరరెడ్డి(డైరెక్టర్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్), కె.శ్రీనివాస్(డైరెక్టర్ ఆపరేషన్) సూచించారు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన వీరు ఆదివారం శ్రీరాంపూర్, మందమర్రి డివిజన్లలో పర్యటించారు. జైపూర్ మండలం ఇందారం ఓపెన్‌కాస్టులో రూ.1.30 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేసిన కోల్ క్రషర్ యంత్రాన్ని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఓసీపీని సందర్శించారు. శ్రీరాంపూర్ ఏరియాకే ఇందారం ఉపరితల గని తలమానికంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రారంభించిన అనతికాలంలో రెట్టింపు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి సాధిస్తోందని తెలిపారు. క్రషర్ యంత్రం పవర్ ప్లాంట్‌లకు అవసరమైన 200 ఎంఎం సైజులో బొగ్గును కత్తిరిస్తుందని పేర్కొన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు బొగ్గు ఉత్పత్తి సాధిస్తున్న ఓసీపీ అధికారులు, ఉద్యోగులను అభినందించారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా అంశాలపై వ్యూ పాయింట్ ద్వారా పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిని ఆదివారం సందర్శించారు. ప్రాజెక్టు ప్లానింగ్‌ను పరిశీలించారు. పర్యావరణం, రక్షణ చర్యల గురించి ఓసీపీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ ఓపెన్‌కాస్ట్ గనిని సందర్శించారు. ఓసీపీ వనిస్థలాలను సందర్శించి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్ష నిర్వహించారు. ఇటీవలే డైరెక్టర్లుగా నియమితులై తొలసారిగా విచ్చేసిన ఇద్దరు ఉన్నతాధికారులను టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఓసీ గని విస్తరణ, ఆర్‌కే-1ఏ, కేకే-1 గనుల జీవిత కాలం పెంచాలని వినతిపత్రం అందించారు. వారివెంట మందమర్రి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్, ఆర్కేపీ ఓసీ పీవో మధుసూదన్, శ్రీరాంపూర్ ఓసీ పీవో పురుషోత్తంరెడ్డి, ఐకే-ఓసీపీ ప్రాజెక్టు శ్రీనివాస్, ఎస్‌ఓటూ జీఎం త్యాగరాజు, అధికారులు వీరయ్య, శ్రీనివాస్, కాంతయాదవ్, వరలక్ష్మి, గని మేనేజర్ రవికుమార్, ఆపరేషన్ మేనేజర్లు బ్రహ్మాజీరావు, నాగన్న, జీఎం చర్చల కమిటీ సభ్యులు పెట్టం లక్ష్మణ్, కుమారస్వామి, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు డి.అన్నయ్య, మల్లారెడ్డి, కందుల శంకర్, సీఎంవోఏఐ ఏరియా అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్, ఏజెంట్ ఏవీరెడ్డి, సీఎంవోఏఐ ఉపాధ్యక్షుడు త్యాగరాజు, బెల్లంపల్లి రీజియన్ జాన్ ఆనంద్, పిట్‌కార్యదర్శి రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో పౌర్ణమి జాతర



సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముతున్న దంపతులు

- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం..



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు..

దండేపల్లి: రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన దండేపల్లి మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో మాఘపౌర్ణమి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. 310 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో సందడిగా కనిపించాయి. భక్తులకు అన్నదానం చేశారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు..

సత్యనారాయణస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం నిత్య హోమాలు, శాంతి హోమాలు, మహాపూర్ణాహుతి, బలిహరణము, స్వామివారి సేవా ఉత్సవము కార్యక్రమాలు నిర్వహించారు.

మనుస్మృతి పునర్ముద్రణ రద్దుచేయాలి

- దళిత బహుజన ఐక్యవేదిక నాయకులు



నిరసనలో దళిత బహుజన ఐక్యవేదిక నాయకులు

పాతమంచిర్యాల: మనుస్మృతిని భారతదేశ రాజ్యాంగంగా ప్రకటించడానికి జరుగుతున్న కుట్రలను భారతీయులు వ్యతిరేకించాలని దళిత బహుజన ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో దళిత బహుజన ఐక్యవేదిక నాయకులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తిరస్కరించిన మనుస్మృతిని మళ్లీ ముద్రించి ప్రచారం నిర్వహించడానికి హైదరాబాద్‌లో ఫిబ్రవరి 11న ఆవిష్కరణ సభ ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. మనుస్మృతి ఆవిష్కరణ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా ఉండడం తెలంగాణ ప్రజలను అవమానించడమే అన్నారు. కార్యక్రమంలో దళిత బహుజన ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ పలిగిరి కనకరాజు, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మోహన్, బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్‌లు కనుకుట్ల మల్లయ్య, మోతే రామదాసు, దళిత ఫోరం నాయకులు ఐత పరమేశ్వర్, మానవ వికాస వేదిక నాయకులు మడిశెట్టి సత్యనారాయణ, గిరిజన ఐక్యవేదిక నాయకులు దిలీప్ రాథోడ్, జనవిజ్ఞాన వేదిక నాయకులు ఎడ్ల కిష్టయ్య ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి తగినబుద్ధి చెప్పాలి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఖానాపూర్: ఎస్సీవర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రానున్న కాలంలో కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్ హాల్‌ల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా మాదిగ, మాదిగ ఉపకులాలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం మోసం చేస్తుందని మండిపడ్డారు. ఈ నెల 11న ఆదిలాబాద్‌లోని జరిగే కేంద్ర హోంశాఖ మంత్రి పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ శనిగారపు కమలాకర్, రాష్ట్ర కార్యదర్శి మునుగూరి ప్రణీత్, ఆదిలాబాద్ కన్వీనర్ ఆరెల్లి మల్లేశ్, మంచిర్యాల కన్వీనర్ చెన్నూర్ సమ్మయ్య, కుమురంభీం జిల్లా కన్వీనర్ బ్రహ్మయ్య, నాయకులు అశోక్, శరత్‌కుమార్, కుదాల స్వామి, నంద కుమార్, తుకారాం, బర్ల రాజ్‌కుమార్, సుందిల్ల మల్లేశ్, భైర మధు, కాంబ్లే బాలాజీ, నాగరాజు, గణేశ్, నవీన్, శ్రీనివాస్ ఉన్నారు.



47ఏళ్ల తరువాత ఒకేచోట..

సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఆసిఫాబాద్: ఆరు పదుల వయస్సు అందరిదీ... వివిధ వృత్తుల్లో పని చేసి కుటుంబ బాధ్యతలు తీర్చుకుని జీవితంలో స్థిరపడ్డారు. పిల్లల వివాహాలు చేసి, మనవలు, మనవరాళ్లతో సరదగా గడుపుతున్న తాతలు, అమ్మమ్మ, నానమ్మలు వీరు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1977 పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు 47ఏళ్ల తరువాత ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎం గార్డెన్‌లో కలుసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి పలువురు భార్యా పిల్లలతో వచ్చారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. తొలుత లోకం విడిచిన గురువులు, మిత్రులకు సంతాపంగా మౌనం పాటించారు. చిన్ననాటి గురువులు కొమురయ్య, సాంబయ్యలను శాలువలతో సన్మానించారు. పట్టణంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో భక్తులు కూర్చోవడానికి సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థి న్యాయవాది సంజయ్ వైరాగరే ఆధ్వర్యంలో వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థులు రావుల వినాయక్, తాటిపెల్లి ప్రమోద్, శిద్దం శెట్టి ఉమేశ్, బోనగిరి సతీశ్ బాబు, ఇరుకుల్ల ఆంజనేయులు, వారణాని కిషన్ రావు, సాంబయ్య, తుకారాం, మహమ్మద్, సంజయ్ వైరాగరే, వల్లపు ప్రేంసాగర్, చక్రపాణి, శివప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నస్పూర్: పట్టణ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియా శ్రీశారద శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో 1994-1995లో పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్ ఆవరణలో జరిగింది. పూర్వ విద్యార్థులు ఒకేచోట చేరి తమ బాల్యస్మృతులను గుర్తు చేసుకున్నారు. వారికి బోధించిన ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. ఈ ఇందులో ఉపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, లక్ష్మణ్, విజయ, సమ్మిరెడ్డి, విద్యార్థులు కూసి తిరుపతి, సంజీవ్ పాల్గొన్నారు.

సబ్సిడీ గొర్రెలు అందజేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ యాదవ్

భీమారం: అర్హత గల యాదవులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సబ్సిడీ గొర్రెల పథకాన్ని అందించాలని తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో యాదవుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నో ప్రభుత్వాలు ఉన్నా యాదవుల గురించి పట్టించుకోలేదని అన్నారు. సీఎం కేసీఆర్ యాదవులు ఆర్థికాభివృద్ధి చెందాలని రాష్ట్రంలోని అన్నీ గ్రామాల్లో గొర్రెల పంపిణీ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఒకటి, రెండో విడతల్లో పేర్లు లేని వారికి, మూడో విడత కూడా అందించాలని తాము పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మెండె మల్లేశ్, మండల అధ్యక్షులు వేల్పుల పర్వతాలు, ప్రధాన కార్యదర్శి కొమ్ము శ్రీనివాస్ పాల్గొన్నారు.